

**భర్త ప్రచారాన్ని ఆసక్తిగా తిలకిస్తూ..**

శనివారం నామినేషన్ వేసిన అనంతరం ప్రచారం చేసేందుకు వెళ్తూ బాన్సువాడలో ఇంటి ఎదుట ప్రజలనుద్దేశించి చేస్తున్న ప్రసంగాన్ని ఆసక్తిగా తిలకిస్తున్న స్పీకర్ పోచారం సతీమణి పుష్పమ్మ

**బంజారాలతో డ్యాన్స్ చేస్తూ..**

భీమ్‌గల్ మండలం రూప్లతండాలో ప్రచార పర్వంలో భాగంగా బంజారా మహిళలతో కలిసి డ్యాన్స్ చేస్తున్న బీఆర్ఎస్ బాల్కొండ అభ్యర్థి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి





**గొంగడి కప్పి.. గొర్రెను బహూకరించి..**

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని కొత్తపేట, కొత్తపేట తండాలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు గొంగడి కప్పి గొర్రె పిల్లను బహూకరిస్తున్న గ్రామస్తులు

**మంగళ హారతులతో స్వాగతం..**

నిజామాబాద్ నగరంలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి బిగాల గణేశ్ గుప్తాకు మంగళ హారతినిచ్చి స్వాగతం పలుకుతున్న మహిళ





**విజయోస్తు..**

పెద్దకొడప్‌గల్ మండలంలో ప్రచారానికి వచ్చిన బీఆర్ఎస్ అభ్యర్థి హన్మంత్‌షిండేకు తిలకం దిద్దుతున్న మహిళ

# విపక్షాలు విలవిల

## అభ్యర్థుల్లేక ఆగమాగం



- ఎన్నికల ముందట తకరారు
- జంపింగ్ జపాంగ్‌లకు టికెట్లు
- పారాచూట్ నేతలపైనే ఆధారం
- ఇదీ కాంగ్రెస్, బీజేపీల దుస్థితి
- ప్రజల్లో దూసుకుపోతున్న బీఆర్ఎస్ పార్టీ

నిజామాబాద్, నవంబర్ 4(నమస్తే తెలంగాణ ప్రతినిధి)

పైన పటారం..లోన లోటారం అన్నట్లుగా మారింది ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ప్రతిపక్ష పార్టీల దుస్థితి. ఎన్నికల రణక్షేత్రంలో ప్రతిపక్షాలు అభ్యర్థుల్లేకుండానే డాంభికాలు ప్రదర్శిస్తున్నాయి. భారత రాష్ట్ర సమితిని ఓడిస్తామంటూ భారీ ప్రకటనలు చేస్తున్నప్పటికీ వారెవ్వరికీ కనీసం అభ్యర్థులే కరువవ్వడంతో ఆగమాగమయ్యే పరిస్థితి ఉన్నది. నేటికీ ఇరు పార్టీలకు కనీసం అభ్యర్థులను ప్రకటించుకునే వెసులుబాటు కూడా లేకపోగా బీజేపీలో పోటీచేసేందుకు అభ్యర్థుల్లేక తలలు పట్టుకోవాల్సిన దుస్థితిని ఎదుర్కొంటున్నది. కాంగ్రెస్, బీజేపీలు ఒక రకంగా ఎన్నికల పోరు ముంగిట చేతులెత్తేశాయన్న చర్చ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున సాగుతున్నది. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో మొత్తం 9 నియోజకవర్గాలున్నాయి. ఇందులో ఎక్కడ చూసినా భారత రాష్ట్ర సమితికి గట్టి పోటీనిచ్చే నేతలెవ్వరూ కనిపించకపోవడంతో పోరు ఏకపక్షం అన్నట్లుగానే సాగుతున్నది. మరోవైపు అందరి కన్నా ముందుగానే సిట్టింగ్‌లకు సీట్లు ఖరారు చేసి ప్రచారాన్ని ఎన్నికల షెడ్యూల్‌కు ముందే ప్రకటించిన గులాబీ దళపతి ఒక రకంగా ప్రతిపక్ష పార్టీలకు సవాల్ విసిరినట్లు అయ్యింది. ప్రతిపక్ష పార్టీల కన్నా ముందుగానే బీఆర్ఎస్ అభ్యర్థులంతా ఆత్మీయ సమ్మేళనాలు, విభిన్న కార్యక్రమాలతో జనాల్లోకి వెళ్తున్నారు. కాంగ్రెస్, బీజేపీలకు ఆ ఛాన్స్ లేకుండా పోయింది.

**అభ్యర్థులే కరువు..**

జాతీయ పార్టీలంటూ గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్, బీజేపీలకు అటు రాష్ట్రంలో, ఇటు ఉమ్మడి జిల్లాలో అభ్యర్థులే లేకపోవడంతో ఆగమాగం అవుతున్నాయి. అప్పటికప్పుడు ఇతర పార్టీల్లో అసంతృప్తితో రగిలిపోతున్న నేతలను పట్టుకొచ్చి టికెట్లు ఇప్పించుకునే పరిస్థితి కాంగ్రెస్, బీజేపీలకు ఎదురవుతున్నది. పారాచూట్ నేతల రాకతో సొంత పార్టీలోనూ ముసలం పెరుగుతుండడంతో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలో ఇంటి పోరును చల్లార్చేందుకు తలలు పట్టుకుంటున్నాయి. ఇలా పలు విధాలుగా సతమతం అవుతూ ఓ వైపు పోటీకి అభ్యర్థులే దొరకకపోవడంతో జాతీయ పార్టీల నేతలు నిట్టూర్చే పరిస్థితి వచ్చిందంటే అతిశయోక్తి కాదు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం నుంచి ఇప్పటి వరకు అభ్యర్థిని కాంగ్రెస్ పార్టీ ప్రకటించలేదు. సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్న కామారెడ్డి నియోజకవర్గంపై పీటముడి వీడడం లేదు. కేసీఆర్‌పై పోటీ చేసేందుకు స్థానిక నాయకులు చేతులెత్తేయడంతో హస్తం పార్టీ దిక్కుతోచని దుస్థితిలో కొట్టుమిట్టాడుతున్నది. జుక్కల్‌లోనూ ఇదే దుస్థితి ఉన్నది. నిజామాబాద్ జిల్లాలో బాల్కొండ, ఆర్మూర్, నిజామాబాద్ రూరల్, బోధన్‌లో అభ్యర్థులను కాంగ్రెస్ ప్రకటించినప్పటికీ ఇందులో బోధన్, నిజామాబాద్ రూరల్ మినహా మిగిలిన చోట్ల అంతా పార్టీ మారి వచ్చిన వారే ఉన్నారు. ఇక్కడ బీఆర్ఎస్‌కు పోటీనిచ్చే నేతలే లేకపోవడంతో కాంగ్రెస్ పార్టీ పారాచూట్ నేతలను చేరదీసుకొని కండువా కప్పి టికెట్లు ఇచ్చుకునే పరిస్థితి ఎదురైంది. అచ్చంగా ఇలాంటి దుస్థితే బీజేపీని వెంటాడుతున్నది. ఎల్లారెడ్డిలో అభ్యర్థి లేక ఇబ్బంది పడాల్సి వస్తున్నదంటే బీజేపీ దుస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఇక బాన్సువాడలోనూ అభ్యర్థులే కరువవ్వడంతో నిజామాబాద్ అర్బన్‌కు చెందిన వారిని సర్దుబాటు చేసుకొని పరువు నిలుపుకోవాల్సి వచ్చిందని బీజేపీ వర్గీయులే చెప్పుకుంటున్నారు.



బడాభీమ్‌గల్‌లో శనివారం ప్రచారానికి వస్తున్న బీఆర్ఎస్ బాల్కొండ అభ్యర్థి, మంత్రి వేములకు మంగళ హారతులతో స్వాగతం పలుకుతున్న ప్రజలు

## సభలతో బీఆర్ఎస్ ధూం..ధాం..

గులాబీ బాస్ కేసీఆర్ మాత్రం ప్రచారంలో దూకుడు పెంచారు. రాష్ట్ర వ్యాప్తంగా హెలికాప్టర్‌లో సుడిగాలి పర్యటన చేస్తూ ఎన్నికల ప్రచారంలో ముందున్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే నాలుగు నియోజకవర్గాల్లో కేసీఆర్ ప్రచార సభలు ముగియగా నవంబర్ 9న కామారెడ్డిలోనూ ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించబోతున్నారు. మిగిలిన నాలుగు నియోజకవర్గాల్లో ఈ నెల 15, 16 తేదీల్లో కేసీఆర్ సభలు నిర్వహించనున్నారు. జుక్కల్, బాన్సువాడ, బాల్కొం డ, ఆర్మూర్‌లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలు దిగ్విజయం కావడంతో అదే స్ఫూర్తితో మిగిలిన నియోజకవర్గాల్లోనూ కేసీఆర్ సభలను విజయవంతం చేసే దిశగా నేతలంతా సిద్ధమవుతున్నారు. కాంగ్రెస్, బీజేపీకి చెందిన స్టార్ క్యాంపెయినర్ల జాబితా వెల్లడైనప్పటికీ వారంతా కనీసం జనాల్లోకి వచ్చి ఓట్లు అడిగే పరిస్థితి కూడా లేకుండా పోయింది. గత నెలలో రాహుల్ గాంధీ ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల్లో తిరిగినప్పటికీ కనీసం హస్తం పార్టీలో జోష్ అన్నదే కనిపించడం లేదు. సాక్షాత్తు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైతం నిజామాబాద్ గడ్డపై అధికారిక కార్యక్రమం పేరుతో బీజేపీ సభకు హాజరైనప్పటికీ కాషాయ పార్టీలో ఆనందమే లేకుండా పోయింది. మోదీ, రాహుల్ కార్యక్రమాలతో ఆ రెండు పార్టీలకు కనీసం మైలేజ్ కూడా రాకపోవడంతో జనాలంతా బీఆర్ఎస్ పార్టీ వైపే మొగ్గ చూపుతున్నట్లుగా స్పష్టమవుతున్నది.



ఆర్మూర్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు పెద్ద సంఖ్యలో హాజరైన జనం

# కాంగ్రెస్, బీజేపీలకు అభ్యర్థులు దొరకడం లేదు..

- బాన్సువాడలో వేరే ప్రాంతం వారు వచ్చి ఏం చేస్తారు..
- బీఆర్ఎస్ అభ్యర్థి, స్పీకర్ పోచారం శ్రీనివాస రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి, స్పీకర్ పోచారం

బాన్సువాడ, నవంబర్ 4: సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రంలోని ప్రజలు, రైతులు , అన్ని వర్గాల వారు సుభిక్షంగా ఉన్నారని, మూడో సారి ప్రభుత్వం ఏర్పాటు అవుతుందని, హ్యాట్రిక్ సీఎం కేసీఆర్ కాబోతున్నారని బీఆర్ఎస్ బాన్సువాడ అభ్యర్థి, స్పీకర్ పోచారం శ్రీనివాస రెడ్డి అన్నారు. నామినేషన్ వేసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ , బీజేపీలకు అభ్యర్థులు దొరకడం లేదని, ఇతర ప్రాంతాల నుంచి తీసుకువస్తున్నారని అన్నారు. వేరే ప్రాంతాల వారికి నియోజకవర్గం గురించి ఏం తెలుస్తుందని, వారు తెలుసుకోవాలంటే పదేండ్లు పడుతుందని అన్నారు. అలాంటి వ్యక్తులు వచ్చి సాధించేది ఏమీ లేదని అన్నారు. కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఆమోదయోగ్యం కాని, అమలుపరచలేని హామీలను ఇచ్చి చేతులెత్తేస్తున్నదని చెప్పారు. ఐదు గంటల కరెంటు కూడా సరిగ్గా ఇవ్వడం లేదని అన్నారు. సీఎం కేసీఆర్ గత ఎన్నికల్లో ప్రజలకు హామీ ఇచ్చిన పనులతోపాటు హామీ ఇవ్వకుండా చేసిన పథకాలు , పనులు పదుల సంఖ్యలో ఉన్నాయని అన్నారు. కాంగ్రెస్, బీజేపీలవి మాటలే తప్పా, చేతలు కావని విమర్శించారు. బాన్సువాడలో ఎవరు ఏం చేశారు.. ఏ పార్టీ నాయకుడు మంచి చేస్తాడని ప్రజలకు తెలుసని, వారే ఆలోచించాలని సూచించారు. ప్రజలు మంచి మనస్సుతో ఆశీర్వదించి కారు గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తాను బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ వేశానని, పార్టీ ఇచ్చిన ఏ ఫారం, బీఫారం, అఫిడవిట్‌ను సమర్పించినట్లు తెలిపారు.


**హుందాగా, ప్రజలు మెచ్చేలా ఉండాలి..**

ఎన్నికల్లో వివిధ రాజకీయ పార్టీల నాయకులు చేసే ప్రచారం హుందాతనంతో, ప్రజలు మెచ్చేలా ఉండాలని హితవు పలికారు. ప్రజా సమస్యలపై స్పందిస్తూ ప్రభుత్వంతో చర్చించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రజల ద్వారా ఎన్నుకోబడిన వ్యక్తి వారి శ్రేయస్సు కోసం పనిచేయాలని చెప్పారు. తాను అనేక సంవత్సరాలుగా ఎమ్మెల్యేగా పనిచేశానని, 1994 నుంచి నేటివరకు ఎనిమిదిసార్లు పోటీ చేసి ఒక్కసారి ఓటమి చెందానని అన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ వారి మధ్యలోనే ఉంటున్నానని, ఈసారి ఎన్నికల్లో భాగంగా ప్రజల వద్దకు వెళ్తున్నానని చెప్పారు. వచ్చే ఐదేండ్లు కూడా ప్రజా ఆశీర్వాదం, యువకుల సహకారంతో గెలిచిన తర్వాత నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు. ఆయన వెంట డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్ రెడ్డి, నాయకులు డాక్టర్ అంజిరెడ్డి, క్రిష్ణారెడ్డి, ఎజాస్, గంగాధర్ పటేల్, వీర్రాజు, భరత్‌నాయక్ తదితరులు ఉన్నారు

**ప్రచారం షురూ..**

బీర్కూర్ మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో శనివారం మధ్యాహ్నం బీఆర్ఎస్ అభ్యర్థి, స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి ప్రచారం ప్రారంభించారు.

అనంతరం బీర్కూ ర్ తండా, కిష్టాపూర్, చించోలిలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు, మహిళలు ఘనంగా స్వాగతం పలికారు. బ్యాండ్ మేళాలు, భాజాభజంత్రీల చప్పుళ్ల మధ్య పటాకులు కాల్చారు. గ్రామాల్లో పోచారం రాకతో ప్రజలు మంగళహారతులు పట్టారు.



అభిమానులు, బీఆర్ఎస్ నాయకులకు ధన్యవాదాలు తెలుపుతున్న స్పీకర్



బాన్సువాడ జ్ఞాన సరస్వతీ ఆలయంలో పూజలు చేసిన అనంతరం స్పీకర్‌రు నామినేషన్ పత్రాలను అందజేస్తున్న అర్చకులు



# స్పీకర్ పోచారం నామినేషన్ దాఖలు

- ఆనవాయితీగా అంబాసిడర్ కారులో వెళ్లిన శ్రీనివాసరెడ్డి
- నామినేషన్ పత్రాలతో ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- తరలివచ్చిన అభిమానులు, బీఆర్ఎస్ శ్రేణులు

బాన్సువాడ , నవంబర్ 4: బాన్సువాడ నియోజకవర్గ భారత రాష్ట్ర సమితి అభ్యర్థిగా స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి శనివారం నామినేషన్ దాఖలు చేశారు. ఉదయం బీర్కూర్ మండలంలోని తిమ్మాపూర్ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో నామినేషన్ పత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రచార వాహనాలకు పూజలు చేయించారు. బాన్సువాడలోని జ్ఞానసరస్వతీ, అయ్యప్ప ఆలయాల్లో పూజలు చేశారు. అనంతరం ఆయన స్వగృహంలో కుటుంబసభ్యులతో కలిసి పూజలు నిర్వహించి, తల్లిదండ్రుల చిత్రపటాలకు పోచారం నమస్కరించారు. సతీమణి పుష్పమ్మ గులాబీ కండువా వేసి ఎదురురాగా పోచారం శ్రీనివాసరెడ్డి నామినేషన్ వేసేందుకు సెంటిమెంట్ అయిన అంబాసిడర్ కారులో పయనమయ్యారు. బాన్సువాడ ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, మైనార్టీ నాయకుడు ఎజాస్ ఖాన్, ఏఎంసీ మాజీ చైర్మన్ సంజీవ్, న్యాయవాది లక్ష్మారెడ్డి, హరిసింగ్ తదితర నాయకులతో కలిసి రెండు సెట్ల నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు.

**ఆనవాయితీగా అంబాసిడర్‌పై...**

తన కూతురు అరుణారెడ్డి పేరుపై వరించిన 7007నంబర్ గల అంబాసిడర్ కారులో స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి ప్రయాణించారు. అంబాసిడర్‌లో నామినేషన్ దాఖలు చేసేందుకు వెళ్తున్న పోచారానికి మద్దతుగా అభిమానులు, బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలివచ్చారు. జై బీఆర్ఎస్... జై పోచారం అం టూ నినాదాలు చేశారు. డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో యువకులు, పార్టీ నాయకులు పాదయాత్రగా తరలివచ్చారు. శనివారం పోచారం శ్రీనివాసరెడ్డి నామినేషన్ దాఖలు చేస్తున్నారన్న సమాచారం తెలుసు కున్న కార్యకర్తలు ఆయన స్వగృహానికి తరలిరావడంతో సందడి వాతావరణం నెలకొన్నది. పాదయాత్రలో రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ డాక్టర్ అంజిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు ఏర్వాల కృష్ణారెడ్డి, నాయకులు బద్యానాయక్, మోహన్ నాయక్, గోపాల్ రెడ్డి, మహ్మద్ ఎజాస్, రాజశేఖర్, మోస్రా జడ్పీటీసీ భాస్కర్ రెడ్డి, పత్తి లక్ష్మణ్, కోటగిరి ఎంపీపీ శ్రీనివాస్ రావు, హన్మంత్ రెడ్డి, వర్ని వీర్రాజు, సంజీవ్, దొడ్ల వెంకట్రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.